గొల్లపూడి కాలమ్

## దిగజారుడు

ఈ మధ్య పేపర్లు చదివేవారు గమనిస్తున్నారో లేదో- ఏ విషయంలోనయినా, ఏ కోరిక సాధించ డానికయినా,ఎవరు ఎవరితో మాట్లాడినా విజ్ఞప్తి చేయడంలేదు.డిమాండ్ చేస్తున్నారు. సవాలు చేస్తున్నారు.బెదిరిస్తున్నారు. హెచ్చరిస్తున్నారు. బెల్లిస్తున్నారు. బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు.

'ఇది మాకు ఆవసరం. చేసి పెట్టండి' ఆని ఎవరూ ఆనడం లేదు.

'ఇది మా హక్కు. చెయ్యకపోతే మీ పని పడతాం' ఆంటున్నారు.

అలనాడు మహాత్మా గాంధి ఒక్కరే 'మీరు వెళ్ళాలి. మాయింట్లో మీరు వుంటున్నారు కనుక'అని నచ్చ జెప్ప బోయి, వినని వ్యవస్థని వినేటట్టు చెయ్యడానికి తనని తానుహింసించుకొన్నారు-ఉపవాసాలతో.

'సంకల్పం' లోని ఈ బలం,చిత్తశుద్ధి లోని ఈ శక్తీ ఈ తరం, ఈ జాతీ  మరిచిపోయినట్టనిపిస్తోంది.

బహుశా వ్యవస్థకూడా బెదిరిస్తే కాని స్పందించనంత మొద్దుబారిపోయిందేమో.

'మాకు తెలంగాణా యివ్వాలి.లేకపోతే సోనియా గాంధీని రోడ్ల మీదికి ఈడుస్తాం' ఆన్నారో కేంద్ర మంత్రి గారు.

'మా సంగతి చూడకపోతే మీకూ మాకూ రాం రాం' ఆని తాను ఉంటున్న మంత్రి మండలి ఆధ్యక్షుని మీదే ధ్వజమెత్తారు ఓ రాష్ట్ర మంత్రి.

సంప్రదింపులకి యిష్టపడి కూర్చొంటూ 'మా డిమండులు నెరవేర్చకపోతే మళ్ళీ ఆయుధాలు పట్టు కొంటాం' ఆన్నారు తిరుగిబాటు నాయకులు-యింకా చర్చలు ప్రారంభం కాకుండానే. మరింక చర్చలు దేనికి!

ఈ మధ్య కల్లు తీసే ముసలాడి ఫొటో ఒకటి పేపర్లో పడింది. 'మా కోర్కెలు తీర్చకపోతే..' ఆంటూ ఈత చాప మీద కూర్చున్నాడు!

'తీసేసిన ఉద్యోగుల్ని చేర్చుకోకపోతే విసీ గారి కుర్చీ కింద కుంపటి పెడతాం' ఆని హెచ్చరిస్తున్నారు తీసేయబడిన ఆంధ్రా యూనివర్సిటీ  సిబ్బంది.

'మా సినీమాలు కర్ణాటకాలో రిలీజు కాకపోతే..' ఆంటోంది ఆంధ్రా నిర్మాతల సంఘం.

ఒకానొక గ్రామంలోఅన్న యోజన పథకానికి లబ్దిదారుల యెంపికలో విచక్షణ చూపారుట- ప్రతిపక్ష పార్టీ పాలక పార్టీ మీద హెచ్చరిక.

కుర్రాళ్ళని శిక్షిస్తే ఒప్పుకునేదిలేదని ఉపాధ్యాయులకి పిల్లల తల్లిదండ్రుల హెచ్చరిక.

మణిపూర్‌లో ప్రత్యేక సాయుధ దళాల చట్టాన్ని ఉపసంహరించాలని ధర్నా.

విద్యా, ఉద్యోగాల్లో దళిత ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్.

టిడిపి-బిజెపి కార్యకర్తలను పోలీసులు ఆక్రమంగా ఆరెస్టు చేస్తున్నారని ధర్నా.

అనంతపురంరైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవడంలేదని పికెటింగ్.

ప్రైవేటు రంగంలో వెనుకబడినవారికి రిజర్వేషన్లు యివ్వకపోతే...

ఈ ఎదిరింపులు సహేతుకమైనవా కావా అన్నది కాదు ఇక్కడి చర్చనీయాంశం.

ఏ కోరిక విషయంలోనయినా ఎదిటి వ్యక్తి మీదో, వ్యవస్థ మీదో గౌరవం, ఆ వ్యవస్థ చిత్తశుద్ధి మీద నమ్మకంలేకపోవడమే యిలాంటి అసమ్మతికి ముఖ్యమయిన కారణం. అలాగే కోరే కోరికని సజావుగా గుర్తించి, సహేతుకంగా పరిశీలించాలనే నిజాయితీ వ్యవస్థలో లేకపోవడమ అంతే ముఖ్యమయిన కారణం. ఇది రెండు పక్షాలకీ వర్తిస్తుంది.

'గాంధీ' చిత్రంలో ఎప్పుడు తలుచుకొన్నా నాకు వొళ్ళు పులకించే సన్నివేశం ఒకటుంది. స్వాతంత్ర్య ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో, బ్రిటిష్ వారి మీద స్వదేశీయులు పూర్తిగా ధ్వజమెత్తిన రోజుల్లో-మహాత్ముడు అరెస్టయారు. ఆయన్ని కోర్టుకు తీసుకొచ్చారు. ఆయన పాలక వ్యతిరేకి. ఉద్యమ నాయకుడు. కాని ఆయన కోర్టు హాలులో ఆడుగు పెట్టగానే-ఒక్కొక్కరే లేచి నిలబడ్డారు. ఆఖరికి న్యాయమూర్తి లేచి నిలబడ్డారు. నేరాన్ని మహాత్ముడు అంగీకరించారు. గత్యంతరంలేక న్యాయమూర్తి యిబ్బంది పడుతూ శిక్షని విధించారు.

ఉద్యమం వ్యతిరేకించేది అయినా – ఉద్యమం చేసే హక్కు పట్ల ఎదుటి వ్యక్తి అవగాహన, చేస్తున్న నాయకునిపట్ల గౌరవమూ- దీనికీ, న్యాయస్థానానికీ సంబంధం లేదు. కాని మహాత్ముడిని గౌరవించడంలో మానవాళి కంతటికీ బాధ్యత ఉంది. అవసరం ఉంది. అది మహాత్ముడు కోరి సంపాదించింది కాదు. రెండు వర్గాల సంస్కారానికి అది నిదర్శనం.

ఆ సంస్కారం అంతటా, అన్నిటా లోపించడమే నేడు పాలకుల, పాలితుల జీవనసరళిలో విశ్వరూపాన్ని దాల్చి కనిపిస్తున్నది. ఇది వ్యవస్థాగతమయిన పతనానికి సంకేతం.

(రచయితని www.gollapudimaruthirao.com లో కలుసుకొన వచ్చును)